- వాటిల్లో కథా సంగ్రహం అని రాస్తూ కొంతవరకూ కథ రాసి కథ మంచి మలుపులో వున్నపుడు "తరువాయి తెరపై చూడండి" అని ముగించేవారు యిక పాటలన్నిటికీ, రాగం, తాళం, పల్లవులూ - అన్నీ రాసేవారు.

మీ నాయనమ్మ ఆడవాళ్ల బుకింగ్ దగ్గర టిక్కెట్లు తీసుకుని - ఆడవాళ్ల గేటులోంచి లోపలకు వెళ్లిపోయింది.

ఇంక నేను మగవాళ్ల బుకింగ్ దగ్గరికి వెళ్లాను... అక్కడ యింతా అంతా దొమ్మి కాదు - కొట్టుకుఛస్తున్నారు. ఒకళ్ల మీద ఒకళ్లు పడుతున్నారు, తోసుకుంటున్నారు, కేకలేసుకుంటున్నారు! ఫస్టు బెల్లు కొట్టేసరికి టిక్కెట్టు కిటికీ తెరిచారు. ఒక్కసారి అందరూ గొల్లున కిటికీవైపు తోసుకున్నారు. ఆలశ్యం అయితే హౌస్‌ఫుల్ అని కట్టేస్తారు. తరువాత బ్లాకు వాళ్లకి అమ్మేస్తారు. బ్లాకులో అమ్మే వాళ్లకి, సినిమా వాళ్లకి లెక్కలుంటాయి - వాటాలుంటాయి! వాళ్ల టైముని బట్టి, డిమాండును బట్టి రేట్లు పెంచేస్తారు పావలాటిక్కెట్టు రూపాయి రెండు రూపాయలు కూడా అమ్ముతారు!

చేతిలో పావలా కన్నా దమ్మిడీ ఎక్కువలేదు! టిక్కట్టు కొనుక్కుని తీరాలి! తప్పదు అనుకుని. దొమ్మిలో నేనూ జొరబడ్డాను. వంటిమీద పడుతున్న తోపుడు దెబ్బలకి తట్టుకుంటూ ఎలాగో అలా కిటికీ వరకూ చేరుకున్నాను! టిక్కట్టు యిమ్మని పిడికిలి తెరిచేసరికి అందులో పావలా లేదు!

హతాశుడనై ఏంచేయడానికి తోచక నిలబడేసరికి ఒక్క తోపుతో యివతల పడేట్టు తోసేశారు. ఇకనేం చేయడం? బిక్కమొహంతో అక్కడే కూలబడిపోయాను. ఒక వైపునుండి దుఃఖం, ఒక వైపు నుండి భయం. భయం ఎందుకంటే - మీ నాయనమ్మ ఒక్కతే హాలులోకి వెళ్లిపోయింది కదా! మళ్లీ కనబడుతుందో లేదో! యింటికి తీసుకువెళ్లడం ఎలాగా? అని-

టిక్కెట్టు తీసుకోకపోయినా, సినిమాకు వెళ్లకపోయినా, ఆట అయేంతవరకూ యివతలే వుండి, సినిమా వదిలే టైంకి, గేటు దగ్గర నిల్చుంటే వస్తూ కనబడుతుంది కదా అప్పుడు వెళ్లిపోవచ్చు కదా అన్న ఆలోచనే రాలేదు. అంచేత అక్కడ ఏడుస్తూ కూర్చున్నాను!

ఒక మంచివాడెవడో నన్నుచూసి-

"ఎందుకురా ఏడుస్తున్నావు?" అని అడిగాడు.

"టిక్కెట్టు కోసం తెచ్చుకున్న పావలా పోయిందండి... మా వాళ్లు ఆడవాళ్లు వయిపు వెళ్లిపోయారండి... ఎలా?" అని బెక్కుతూ అన్నాను.

"మరి డబ్బుల్లేవా?"

"లేవండి!"

"అయితే సరే యీ టిక్కెట్టు తీసుకువెళ్లు!" అని పావలా టిక్కెట్టు ఒకటి యిచ్చాడు. అవి చూసి నాకు నిజమో, హాస్యమో అనిపించింది. నన్నూ నా ఏడుపునూ చూసి ఆటపట్టిస్తున్నాడేమోనని అనుకున్నాను కానీ నాకిచ్చింది నిజం టిక్కెట్టే - అలా చూస్తూ వుండిపోయేసరికి-

"ఇది మంచి టిక్కట్టేన్రా! మా స్నేహితుడొకడు రాలేదు అందుకని నీకిస్తున్నాను!" అని అంటూ వెళ్లిపోయాడు.

"దేవుడిలా వచ్చాడు ఎంత మంచివాడో అనుకుంటూండగానే రెండో బెల్లు కొట్టేశారు. కళ్లు తుడుచుకుంటూ గేటు వయిపు పరుగెట్టాను.

హాల్లోకి వెళ్లి మధ్యలో వున్న బల్ల దగ్గరికి వెళ్లి మీ నాయనమ్మ కోసం వెతుకుతూ చూశాను. మీ నాయనమ్మ కూడా మగవాళ్ల గేటు వయిపు నేను వస్తున్నానో లేదో అని చూస్తూనే వుంది కాబోలు నన్ను చూసి చేయి వూపి నావైపు వచ్చింది. బల్లకి యిటువయిపు నేనూ అటు వయిపు అదీ కూర్చున్నాం.

మేమిద్దరం చిన్నవాళ్లమే కదా ఒక దగ్గర ఎటు వయిపు కూర్చున్నా ఎవరేమంటారు? అన్న ఆలోచనలేకపోయింది. అలా సినిమా అయినంతసేపూ ఎడం ఎడంగానే కూర్చున్నాం - ఇంటర్‌వెల్‌లో ఒక అణా యిచ్చి రెండు జంతికలు కొని నాకోటి యిచ్చింది.

"డబ్బు లెక్కడివి! అని అడిగేసరికి వాళ్ళమ్మ వేరేగా కొనుక్కోమని డబ్బులు యిచ్చిందని చెప్పింది. తరువాత రెండు షోడాలు కూడా తాగేం. ఆ రోజుల్లో సినిమా మొదట్లో ఇన్‌ఫర్‌మేషన్ ఫిల్ములు వేసేవారు. ప్రపంచ యుద్ధం సీనులో బ్రిటిష్‌వారి సైనిక విన్యాసాలూ, గాంధీ, నెహ్రూ మీటింగులలో లాఠీఛార్జీలూ కూడా చూపెట్టేవారు. ఇంటర్వెల్‌లో ఇంగ్లీషు స్టంటు సినిమాల ట్రయల్ రీళ్లు - ప్రకటనల స్లయిడులూ చూపెట్టేవారు.

సినిమా వదిలాక మళ్లీ యిద్దరం మెయిన్‌గేటు దగ్గర కలుసుకుని యింటికి బయలుదేరాం! సిగ్గో మోమాటమో ఏమో గాని ఇద్దరం, ఒక్కళ్లతో ఒకళ్లం మాట్లాడుకోలేదు. రాత్రి తొమ్మిదయింది. గబగబా మా వీధి మొదట్లోకి వచ్చాం.

వీధిలో ఎలక్ట్రిక్ లైట్లు మసకమసకగా వెలుగుతున్నాయి. అయినా అది వెన్నెల రాత్రులు కాబట్టి వెలుతురుగానే వుంది.

జున్నమ్మగారి యిల్లు వచ్చింది. వాళ్లింటి ముందు అరుగులమీద - జున్నమ్మ వలహాలమ్మ, కన్నమ్మగారూ కూర్చుని మమ్మల్ని చూసి -

"ఎవర్రా! అబ్బాయీ, అమ్మలూ మీరేనా! యింత రాత్రపుడెక్కడినుండి వస్తున్నారు?" అని ఒక్కసారి అడిగారు.

"సినిమాకి వెళ్లేం".

"ఆ! అంటూ బుగ్గలమీద చేతులు వేసుకుని యిప్పటినుండే మీరిద్దరూ సినిమాలకి వెళుతున్నారా!" అని నవ్వుకుంటూ అన్నారు.

తలలు వంచుకుని మరేం జవాబు చెప్పకుండా గబగబా ఆ యిల్లు దాటినా యింకా మాగురించి ఏమేమో అనుకుంటూ నవ్వుకుంటూనే వున్నారు.

అడివమ్మగారింటికొచ్చాం. అక్కడ అడివమ్మ, నరసమ్మ, బంగారమ్మ కూర్చుని కబుర్లాడుకుంటున్నారు.

"సినిమా నుంచేనా వస్తున్నారు? పెళ్లి కాకపోయినా మొగుడూ పెళ్లాల్లా ఎంచక్కా వెళ్లి వస్తున్నార్రా! అయినా ఏం తప్పులేదులే! అనుకుంటున్న సంబంధమే కదా! యిద్దరూ పైవాళ్లా ఏమిటి?" అని హాస్యధోరణిలో అంటూ నవ్వుకుంటున్నారు. అక్కడి నుండి కూడా మాట్లాడకుండా వెళ్లిపోయాం.

నారాయణమ్మగారి యిల్లు వచ్చింది. గుమ్మంలో నారాయణమ్మ, సీతమ్మ, జానకమ్మ మాకోసమే ఎదురుచూస్తున్నట్టు-

"ఇలా రండ్రా! ఏ సినిమాకు వెళ్లేరేంటి?" అని అడిగారు.

"క్రిష్ణప్రేమకి!"

"ఆహా! మంచి సినిమాకే వెళ్లేరే! చక్కా రాధా కృష్ణుల్లా వున్నార్రా! ఇంట్లో చెప్పే వెళ్లేరా. చెప్పకుండా చెక్కేశారా!... పెళ్లికి ముందే యిలా అయితే పెళ్లయాక మిమ్మల్ని పట్టలేంరా! వేగిరం ఆ పెళ్లి కూడా చేసేసుకోండి! మా కళ్లారా చూస్తాం" అని ఎగతాళి చేసి నవ్వుతున్నారు. అయినా వాళ్లు హృదయపూర్వకంగానే కోరుకుంటున్నారు. వాళ్ల మాటల్లో కల్లా, కపటం లేదు.

మా యిద్దరికీ సిగ్గు మొగ్గలయినాయి, ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ ఎదురుగా వున్న మా యింటి గుమ్మంలోకి ఒక్క దూటున పరుగెట్టాం.

వాళ్ల నవ్వులు పువ్వులయినాయి.

"ఎందుకు తాతా వాళ్లలా అంత రాత్రి అయినా కూడా మిమ్మల్ని ఏడిపించడానికా కూర్చున్నారు!"

అది ఏడిపించడానికి కాదురా! మామీద వాళ్లకున్న అభిమానం, ఆప్యాయత, ప్రేమ అంత చిన్నతనంలో మేమిద్దరం కలిసి సినిమాకు వెళ్లడం వింతేకదా మరి. మమ్మల్ని హాస్యం పట్టిద్దామని - మేం సినిమా నుండి తిరిగి వచ్చేవరకూ గుమ్మాలలో కాచుకు కూర్చుని మమ్మల్ని పలకరించేరన్నమాట! అవన్నీ ఆశీర్వచనాలేనన్నమాట! యిప్పటిలా ప్రక్కనున్న వాళ్లనే తెలియని రోజులు కావు. ఒక వీధిలో వుంటున్నారంటే ఒకరికొకళ్లు తోడుగా ఒకే కుటుంబంలో వాళ్లలా కలిసిమెలిసి వుండేవారు. ఎవరింట్లో నన్నా శుభకార్యం వస్తే యిప్పట్లా ఆర్డర్లివ్వడానికి హోటళ్లు వుండేవి కాదు. పెళ్లిళ్లలో వంటలు బ్రాహ్మలు చేసేవారు. అంచేత ఒక్కొక్క పెళ్లిలో ఒక్కొక్క రుచిగా వుండేవి భోజనాలు. యిప్పుడయితే ఏ పెళ్లికి వెళ్లినా అదే రుచి. అవే వంటకాలు. ఆ రోజుల్లో వీధిలో అందరూ కలిసి అటుకులూ, అరిసెలు, అప్పడాలూ, వడియాలూ, చక్రిలాలు

*(తరువాయి భాగం 52వ పేజీలో)*

# మయూర లాస్యం


మనదేశంలోని పక్షి జాతుల్లో నెమలికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఏ పక్షికీ లేనంత అందాన్ని ఈ పక్షి సంతరించుకుంది. మయూరాన్ని జాతీయ చిహ్నంగా మన భారతీయ ప్రభుత్వం వారు ప్రకటించి, ఆ విధంగా ఆ పక్షికి సము చితస్థానం ఇచ్చారు.

అడవులకు ఓ సుందరమైన కిరీటం వంటిది నెమలి అంటే అతిశయోక్తి లేదు! ఎన్నెన్నో వన్నెచిన్నెలతో పురివిప్పిన మయూరం చేసే లాస్యం నేత్రాలకు ఓ ఉత్సవం వంటిది. ఆ అనుభవం ఎన్నటికీ మరువలేనిది! అనాది కాలం నుంచీ నేటి వరకు నెమలి ప్రశంసలు పొందుతూనే ఉంది. నాలుగు అడుగుల పొడవు ఉండే దీని సొగసైన తోక ఆకుపచ్చటి రంగుతో ముచ్చట గొలుపుతూ ఉంటుంది. ఆ తోకచుట్టూ అల్లుకొని ఉన్న అద్భుత కళానైపుణ్యాన్నే 'నెమలికన్నులు' అంటారు! శతాబ్దాల తరబడి అనేక విదేశాలకు ఎగుమతి అయ్యాయి ఈ పక్షులు. మనదేశంలోని వివిధ చిత్ర కళల్లో, కర్ర, రాయి, మట్టితో చేసిన కళాఖండాలపై నెమళ్ళను అద్భుతంగా చిత్రించడం జరిగింది. 3 వేల నుంచి క్రీస్తుకు పూర్వం 15 వందల సంవత్సరాల్లో శాస్త్రజ్ఞులు పరిశోధన నిమిత్తం భూమిని తవ్వగా, వారికి భూగర్భంలో కొన్ని మట్టి పాత్రలు లభ్యమయ్యాయి. వాటిపైన కూడా నెమలి చిత్రాలు చిత్రించబడి ఉన్నాయి!

పరమేశ్వరుని కుమారుడు కుమారస్వామి వారు నెమలి వాహనుండై సంచరిస్తారు. మయూరం అడవుల్లోనే కాక పర్వత ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో సహితం జీవిస్తుంది. జన సంచారం హెచ్చుగా ఉండే ప్రదేశాల్లో కూడా ఇది మనిషికి చేరువలో ఉంటుంది. వివిధ ప్రాంతాల్లో, అనేక జానపద కథల్లో మయూరానికి ప్రాధాన్యత ఉన్నది. కొన్ని ప్రాంతాల్లోని గ్రామాల్లో, అడవుల్లో నెమలికి ఏ అపకారం జరక్కుండా ప్రజలు కాపాడుకుంటారు. ఈ పక్షిని ఓ దేవతలా కొలుస్తారు.

మయూరం స్ఫూర్తితో కళాకారులు వివిధరకాల కళలు ఉజ్వలమానమై ప్రకాశిస్తాయి! దేశమంతటా గల నేతపనివారు, చెయ్యి తిరిగిన కళాకారులు తాము రూపొందించే మగువల వస్త్రాలపై నెమలి రూపాలను బహుసుందరంగా ఆవిష్కరిస్తారు. గుజరాత్‌లో తయారుకాబడే పటోలా చీరెలపై కళా కారులు చూపే మయూర విన్యాసం బహు ముచ్చ టగా ఉంటుంది. ఔరంగాబాద్‌లోగల హిమ్రూ నేత వస్త్రాలపై ఆ కళాకారులు సాక్షాత్తు నెమలి కన్ను లనే మేళవిస్తారు! ఇందువలన ఆ చీరెల సొగసు రెట్టింపు అవుతుంది.

నగర రూపకల్పనలో బంగారు పనివారు నెమలి సొగసులను అద్భుతంగా ప్రదర్శిస్తారు - వజ్రాలు, వైఢూర్యాల నడుమ. శ్రీకృష్ణునికి అత్యంత ప్రీతి పాత్రమైనది మయూరం. కృష్ణభగవానుడు



తన కిరీటంపై నెమలి కన్నులను సదా ధరించేవాడు. అనాదికాలంగా ప్రేమికుల జంట మయూరాలను చూసి మురిసిపోయేవారు. ఆ జంట వియోగంలో ఉన్నప్పుడు నెమళ్లను చూసి సేద దీరేవారు. రాజులు సహితం తాము ముద్రించిన నాణాలపై నెమలికి సముచితస్థానం ఇచ్చారు. కుమారగుప్త ప్రభువు బంగారు నాణాలు ముద్రించాడు. వాటిపై మయూర లాస్యం కనువిందు చేస్తుంది. కొందరు గుప్త ప్రభువులు వెండి నాణాలు ముద్రించి వాటిపై నెమలి చిత్రాన్ని అందంగా చిత్రించారు. ఆ రాజులు తమ నాణాలపై లక్ష్మీదేవి నెమలికి ఆహారం అందిస్తున్నట్లుగా మరికొన్ని చిత్రాలు ముద్రించారు. కుమారస్వామి నెమలిపై విహరిస్తున్న నాణాలు కూడా ఉన్నవి.

మొఘల్ చక్రవర్తి షాజహాన్ కోట్లాది రూపాయిలు వెచ్చించి మయూర సింహాసనాన్ని రూపొందించాడు. వీక్షించిన వెంటనే ఆనందం కలిగించే సుందరమైన నెమలి సదాస్మరణీయం! కళాకారులకు స్ఫూర్తిదాయకం!

- కొడిమెల శ్రీరామమూర్తి

---

*(50వ పేజీ తరువాయి)*

యిలాంటివన్నీ చేయడానికి సాయపడే వారు. నెల రెండు నెలలముందునుండి పెళ్లి పనులు మొదలెట్టేవారు.

అరటి గెలలు, గుమ్మడికాయలు, కాయగూరలు, యిలాటివి తమ దొడ్లలో పండేవాటిని తెచ్చి యిచ్చేవారు. ఒక యింట్లో నుండి మరో యింట్లోకి వెళ్లడానికి ద్వారాలుండేవి. అలాగే యిళ్లకి ముందు వయిపు ఒక వీధి వుంటే పెరటి వయిపు మరొక వీధి వుండేది. యీ వీధిలోనుండి ఆ వీధిలోకి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లేవారం కాదు ఏ యింటిలో నుండయినా తిన్నగా వెళ్లిపోయేవాళ్లం. యింట్లో వాళ్లు ఏ పనుల్లోవున్నా ఏమీ అనేవారు కాదు. అలాగని రోడ్లమీద పోయేవాళ్ల సంగతికాదు. ఆ వీధిలో ఆడుకునే పిల్లలకి. నూతుల దగ్గర స్త్రీలు స్నానాలు చేస్తున్నపుడు కూడా మేం ఆడుకుంటూ అలా వెళ్లిపోతే వాళ్లు కోప్పడేవారు కాదు.

"మనబ్బాయ్ కదటే - మనవేణే కదటే" అనేసేవారు. మాకెవరికయినా కళ్లకలకలు వస్తే అప్పుడు "చనుపాలు" గొప్ప మందు. ఆ వీధిలో బాలింతలెవరువుంటే వాళ్లయింటికి పోయి కనురెప్పలు విడదీసి పట్టుకుంటే ఆ అమ్మ డైరెక్టుగా పాలను కళ్లలోకి పిండేది. ఆ వచ్చే ఫోర్సువల్ల కన్నంతా శుభ్రంగా కడుక్కుపోయేది. దీన్నుండే ఆ కళ్ల కలక పోయేది.

ఇప్పటిలా అందర్నీ ఒకలాగే అంకుల్, ఆంటీ అని పిలచేవారు కాదు - వాళ్లని తాతయ్యా అని, పెద్దవాళ్లని బాబాయ్ అనో మావయ్య అనో, తోటి వాళ్లని అన్నా అనో, తమ్ముడూ అనో బావ అనో వరసపెట్టి పిలిచేవాళ్లం. ఆడవాళ్లయితే బామ్మగారని, పిన్నిగారని, దొడమ్మగారని, అత్తయ్యా అని, అక్కా, చెల్లీ, వదినా అని పిలిచేవారు. ఆ పిలుపులో అవతలి వారి వయసు, గౌరవం తెలిసేవి. యిప్పుడో చిన్నా పెద్దా వయసు భేదం లేకుండా అందర్నీ అంకుల్, ఆంటీ అని పిలుస్తున్నారు. అందువల్ల వాళ్లెంత వయసువాళ్లో తెలియడం లేదు. ఆఖరికి ముష్టివాళ్లనీ, కూరగాయలమ్మేవాళ్లనీ కూడా అలాగే పిలుస్తున్నారు, వాళ్లూ అలాగే పిలుస్తున్నారు. అమ్మా, నాన్నలని మమ్మీ, డాడీలని పిలుస్తున్నారు. కాన్వెంట్ చదువుల వల్ల కన్నతల్లిలాంటి మాతృభాషనే మరచి పోతున్నారు!

అలా వుండేదర్రా! అప్పుడు మా చిన్నతనం. తర్వాత తర్వాత ఆ రోజులు పోయాయి. అలనాటి సినిమాలు పోయాయి. ఇప్పుడు మిగిలిందల్లా, స్పీడు, వికారమయిన అభినయాలు, అపహాస్యం, డబుల్ మీనింగు మాటలు, పాటలు, అసభ్యకరమయిన దృశ్యాలు, హోరెత్తించే శబ్దాలు, కొట్టుకోడం, నరుక్కోడం, హింస, దోపిడీలు, దొంగతనాలు యివేకదా? అప్పటి సినిమాలు చూసి ప్రజలు చైతన్య వంతులయితే యిప్పటి సినిమాలు చూసి పిచ్చివాళ్లూ, దుర్మార్గులూ అవుతున్నారు! మంచిని హేళన చేస్తున్నారు. విచ్చల విడిగా ప్రవర్తిస్తున్నారు" అని ముగించాడు.

అంతావిని. మనవడూ మనవరాలూ-

"అయితే తాతా నువ్వెపుడు సినిమాకు వెళ్లినా ఏదో ఒకటి పారేసుకుంటూ వుంటావన్నమాట! అంచేత యిప్పుడు సినిమాలకెళ్లడం మానేశావు కదూ!" అని అన్నారు.

మరేం జవాబు చెప్పలేక ఊరుకున్నాడు తాతయ్య. ❃